'పీఎంశ్రీ'కి స్కూల్ ఎంపిక

- ఐదేళ్లలో నేలపోగుల పాఠశాల అభివృద్ధి
- ఇప్పటికే రూ.7 లక్షల నిధులు విడుదల
- దాత సహకారానికి తోడైన పీఎం పథకం



నేలపోగుల కేసరి రత్నమాల ప్రాథమికోన్నత పాఠశాల



స్కూల్‌డే కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు(ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగుల ప్రాథమికోన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) ఫేజ్–2లో ఎంపికైంది. ఈ పథకంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే కొంత మెరుగుగా ఉన్న పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో 15 పాఠశాలలు ఎంపిక కాగా ఈ ఏడాది జనవరిలో నేలపోగుల ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేసి వివిధ రకాల విద్యాభివృద్ధి పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే మొదటి విడతగా రూ.7 లక్షలు విడుదలయ్యాయి. ఇందులో ప్రీస్కూల్ బోధనకు తగిన విధంగా గదులను రూపొందిస్తున్నారు.

పీఎంశ్రీ పథకంలో పాఠశాలలో చేపట్టనున్న పనులు

పీఎం శ్రీ పథకంలో ప్రీస్కూల్ విద్యా బోధనకు అనుగుణంగా స్నేహపూర్వక ఫర్నీచర్, అవుట్‌డోర్ ప్లే మెటీరియల్స్, గదులల్లో పూర్తిస్థాయిలో ఫర్నీచర్, ఇంటిగ్రేటెడ్ సైన్స్‌లాబ్ అందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఐసీటీ, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌తో పాటు సకల సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తారు. ప్రీస్కూల్‌కు విద్యార్థుల కోసం ఒక టీచర్, ఆయాను కూడా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. వీటితో పాటు విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా స్కూల్ డే నిర్వహణకు కొంత నిధులు ఖర్చు చేసేందుకు వీలు ఉంటుంది. ఇప్పటికే నేలపోగుల విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలకు కూడా వెళ్లి వచ్చారు.

దాత ఎన్‌ఆర్‌ఐ సహకారానికి..

ఎన్‌ఆర్‌ఐ లక్ష్మీనారాయణ నేలపోగుల యూపీఎస్‌ను ఇంగ్లిష్ మీడియంగా సొంత డబ్బులు ఖర్చు చేసి రత్నమాల కేసరి ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చారు. అదనపు తరగతి గదులను నిర్మించి ప్రత్యేకంగా కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను, డైనింగ్ హాల్‌ను కూడ ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఎకరంన్నర స్థలాన్ని కొనుగోలు చేశారు. సుమారు రూ.కోటిలతో పాఠశాల రూపురేఖలను మార్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం శ్రీలో ఎంపికై మరింత అభివృద్ధిలో దూసుకుపోనుంది.

అభివృద్ధి చేయడమే లక్ష్యం



పాఠశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ట్రస్టు ఏర్పాటు చేసి నిధులు అందజేస్తున్నాం. విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో బోధన జరగాలనే లక్ష్యంతో మొదటి నుంచి ఏర్పాట్లు చేస్తున్నాం. దానికి తోడు కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకంలో ఎంపిక కావడం మరింత సంతోషంగా ఉంది.

-లక్ష్మీనారాయణ, ఎన్‌ఆర్‌ఐ, రత్నమాల కేసరి మెమోరియల్ ట్రస్టు చైర్మన్

సద్వినియోగం చేసుకోవాలి



పీఎం శ్రీ పథకంతో పాఠశాలలో సకల సౌకర్యాలతో ఎల్‌కేజీ నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుంది. ఆధునిక పద్ధతులతో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బోధన జరుగుతుంది. తల్లిదండ్రులు ఇక ప్రైవేట్ పాఠశాలలను మరిచిపోయి ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- టి.నవీన్‌కుమార్, హెచ్‌ఎం, నేలపోగుల యూపీఎస్

విజ్ఞాన విహార యాత్రకు తరలిన విద్యార్థులు



రామప్ప ఆలయ సందర్శనలో విద్యార్థులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం విజ్ఞాన విహార యాత్రలో భాగంగా క్షేత్ర పర్యటనకు తరలి వెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక కట్టడాలు వేయి స్తంభాగుడి, రామప్ప దేవాలయం, లక్నవరం, నిట్, భద్రకాళీ దేవాయలం, ముల్కనూరు మహిళా పాల ఉత్పత్తి కేంద్రానలు విద్యార్థులు సందర్శించారు. నిట్‌లో వివిధ విభాగ అధిపతులు విద్యార్థులకు ఆయా విభాగాలలో జరుగుతున్న విద్యాబోధన, శాస్త్ర ప్రగతికి సంబంధించిన అంశాలను ఎగ్జిబిట్స్ రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు నిట్ ప్రొఫెసర్లు సమాధానాలు ఇచ్చినట్లు హెచ్‌ఎం శోభా రాణి తెలిపారు. ఉపాధ్యాయులు రమేశ్, అశోక్‌కుమార్, వెంకటయ్య, బలరాం, మధు, జత్రుత, అన్నపూర్ణ, శోభ, సుమతి, మొహర్‌నిషా బేగం పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



బచ్చన్నపేట: దబ్బగుంటపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం హెచ్‌ఎం బాలకిషన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

భూభారతి చట్టాన్ని అమలు చేయాలి

చిల్పూరు: భూభారతి చట్టాన్ని వెంటనే అమలు చేయాలని భూమాత రైతు సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో టీపీపీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదం గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పంటలకు సరిపడా సాగు నీరు అందక పోవడంతో అవి ఎండిపోతున్నాయన్నారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సందర్భంగా రైతులకు ఇచ్చిన రూ. 2లక్షల రుణ మాఫీ హామీని పూర్తిగా అమలు చేయాలన్నారు. రాజేశ్వర్, రాజయ్య, నరహరి, రాజు, అనీల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం అనివార్యం

- మాజీ మంత్రి దయాకర్‌రావు



ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం అనివార్యమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం చౌడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు కంచర్ల సంపత్, వాసర్ల సాగర్ తదితరులు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సుందర్‌రామిరెడ్డి, కొల్లూరి సోమన్న, తీగల దయాకర్, చింత రవి, రంగయ్య, చంద్రయ్య, ఐలయ్య, సంపత్, యాదగిరి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ముందుకు రావాలి



వంట గదిని ప్రారంభిస్తున్న పద్మ భిక్షపతి

లింగాలఘణపురం: ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు ముందుకు రావాలని పాఠశాల పూర్వ విద్యార్థి, వంటగది దాత ప్యాట రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రవి సొంత డబ్బులతో వంటగది నిర్మించి తల్లిదండ్రులు పద్మ భిక్షపతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మార్తా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సాయం చేయడం ఆనందంగా ఉందని, అన్ని సౌకర్యాలు ఉన్నప్పుడే విద్యార్థులు చదువుకోగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విష్ణుమూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం మల్లికార్జున్, సాయిమల్లయ్య, కాటం కుమార్, శ్రీలతారెడ్డి, రాగల్ల ఉపేందర్, వీరయ్య, పూర్వవిద్యార్థుల ఐక్య వేదిక కన్వీనర్ మల్లేశం, పాఠశాల చైర్మన్ సరిత, మాజీ ఎంపీటీసీలు భిక్షపతి, నర్సయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- రూ.50 లక్షలు మంజూరు



వైకుంఠధామానికి వెళ్లేందుకు వేస్తున్న సీసీ రోడ్డు

రఘునాథపల్లి: ఆఖరి మజిలీ గౌరవ ప్రదంగా ఉండాలని గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని కంచనపల్లిలో రూ.12 లక్షలతో వైకుంఠ ధామం నిర్మించింది. ఐదేళ్లు కావస్తున్నా వైకుంఠధామానికి రోడ్డు సౌకర్యం లేక అంత్యక్రియలు నిర్వహించేందుకు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సమస్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి హైస్కూల్ నుంచి వైకుంఠధామానికి 700 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్‌లో రూ.50 లక్షలు మంజూరు చేశారు. వారం రోజులుగా రోడ్డుపై మొరం పోసి రోలర్‌తో తొక్కించారు. గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని వాట్సప్ గ్రూపులలో ఎమ్మెల్యే కడియంకు రాజకీయాలకతీతంగా ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ నాయకుల సంబురాలు



రఘునాథపల్లి: సంబురాల్లో బీజేపీ నాయకులు



పాలకుర్తిలో..



కొడకండ్లలో..

రఘునాథపల్లి/పాలకుర్తి/కొడకండ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం పట్ల ఆ పార్టీ శ్రేణులు గురువారం రఘునాథపల్లి, పాలకుర్తి, కొడకండ్ల మండల కేంద్రాల్లో టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పుప్పాల వేణుకుమార్, మంద వెంకటేశంయాదవ్, వల్లాల ఉపేందర్, కావటి ముత్యాలు, మారం రవికుమార్, కర్ర శ్రీనివాస్ రెడ్డి, కమ్మగాని శ్రీకాంత్, వేల్పుల దేవరాజు, శ్రీనునాయక్, మేటి శ్రీనివాస్, అంజనేయులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతండాకు చేరిన గోదావరి జలాలు



పెద్దతండాకు చేరిన సాగు నీరు

దేవరుప్పుల: 15 రోజులుగా సాగు చేసిన వరిపంట పొలాలు ఎండిపోతున్న తరుణంలో అన్నదాతల ఆవేదనకు స్పందించిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిల ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు గురువారం పెద్దతండా ఏరియాకు గోదావరి జలాలు చేరుకున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి కెనాల్ కాల్వల మరమ్మతులు చేయించడంతో గొలుసు కట్ట కాల్వల నుంచి పెద్దతండా, చౌడూరు, రంబోజీగూడెం, చిప్పరాళ్లబండతండా మీదుగా కడవెండి తాళ్లచెరువుకు సాగు నీరు చేరే అవకాశం ఉంటుంది. ఏదీ ఏమైనా పొట్టకొచ్చిన వరి పంటల పరిరక్షణ కోసం సాగు నీరు అందించేందుకు కృషి చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

స్టేషనరీ పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రం ధర్మకంచ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీని గురువారం ట్రస్టు ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, మన సంస్కృతి, సంస్కారం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మన బాధ్యతగా పని చేయాలని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు మోహన కృష్ణ భార్గవ, భానుచందర్, నరేందర్, జి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల..



స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివే 73 మంది విద్యార్థులకు వర్ధన్నపేట మండలం రెడ్డిపాలెంకు చెందిన ఏ7 ఫౌడేషన్ ప్రారంభించిన సందర్భంగా వ్యవస్థాపకులు బరిగెల అరవింద్ పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదారపు విజయ్‌కుమార్, అరవింద్, యాకర, వంశి, అరుణ్, మనీ, కన్నయ్య, ప్రణయ్, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చెస్ బోర్డులు..



పాలకుర్తి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులకు మూడు చెస్, క్యారమ్ బోర్డులు, వాలీబాల్ నెట్ ఎస్సై లింగారెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నారు. శారీరక, మానసికోల్లానికి క్రీడలు దోహదపడతాయన్నారు. స్పెషల్ ఆఫీసర్ నవీన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సింగపురం ఇందిర వర్గీయుల నిరసన



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రూపు రాజకీయాలు వద్దంటూనే టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర వర్గీయులను పక్కకు పెడుతున్నాడని ఆరోపిస్తూ ఆమె వర్గీయులు గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరికి వ్యతిరేకంగా నినాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కడియంతో పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తూ గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కడియం శ్రీహరి తన వైఖరిని మార్చుకోవాలన్నారు. కాగా, ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉండగా ఇందిర వర్గీయులు ఘన్‌పూర్‌లో శ్రీహరికి వ్యతిరేకంగా నిరసన చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. నాయకులు మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, రేండ్ల సమ్మయ్య, సింగపురం నాగయ్య, కోరుకొప్పుల మహేందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల: గొల్లపల్లికి చెందిన గీత కార్మికుడు రాచకొండ సత్తయ్య ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాగా, గ్రామస్తులు సేకరించిన రూ.42,501 లను బాధితుడికి గురువారం అందజేశారు. ఈ విషయమై జక్కి నర్సయ్య మాట్లాడుతూ గ్రామ వాట్సప్ గ్రూపు ద్వారా సత్తయ్యకు ఆర్థిక సాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

జఫర్‌గఢ్: తండాలు, గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల బహిరంగ సభలో ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఎన్నికలకు ముందు గిరిజనులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయకపోవడం తగదన్నారు. గిరిజన యువతకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతిని నివారించడంతో పాటు గిరిజన మహిళలపై దాడులను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



చిల్పూరు: ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని కాంగ్రెస్ పార్టీ నష్కల్ గ్రామ అధ్యక్షుడు కూరపాటి సాంబయ్య అన్నారు. ఈ మేరకు గ్రామంలో సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి వద్ద అఘోరీ ప్రత్యక్షం



దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారి గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలో గురువారం అఘోరీ వాహనం ప్రత్యక్షమవడంతో పరిసరాల ప్రజలు సందర్శించేందుకు చేరుకున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్ సిబ్బందిని అక్కడికి పంపించారు. అఘోరీ వద్దకు కానిస్టేబుల్ యాకేష్ తదితరులు చేరుకుని ఆరా తీయగా మధ్యాహ్న భోజనం చేస్తుండగా ప్రజలు చూసే ఇబ్బందులు పెడుతున్నారని వాపోయింది. ఈ విషయమై స్పందించిన పోలీసులు గుమిగూడిన ప్రజల్ని వెళ్లగొట్టగా కారులోనే భోజనం చేసిన అనంతరం జనగామ వైపు వెళ్లిపోయింది.

పుస్తెమెట్టెల అందజేత



బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు గండు కనుకయ్య–వినోదల కూతురు వివాహానికి ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు, లయన్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి రూ. 20వేల విలువైన పుస్తెమెట్టెలను గురువారం అందించారు. చల్ల తిరుపతిరెడ్డి, రాజుపేట గోపాల్, వేముల మహదేవ్, తాడెం నరేందర్, గిద్దెల భాస్కర్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి



బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని బీడీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. మహంకాళి బాలచారి(48) ఇంటి వద్ద ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు అందులో పడి పోయాడు. ఎంత వెతికినా బాలచారి ఆచూకి లభించకపోవడంతో నీటి సంపులో చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



బచ్చన్నపేట: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు మండల కేంద్రంలో పట్టుకున్నారు. ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాల ప్రకారం ..మండల కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బచ్చన్నపేట వాగు నుంచి ఇసుకను మండల కేంద్రానికి తీసుకొస్తుండగా ఆపి విచారించడంతో అనుమతి పత్రాలు లేకపోవడంతో గోపాల్‌నగర్‌కు చెందిన పరశురాములు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్సై హమీద్ హెచ్చరించారు.

గట్టయ్య మృతి తీరని లోటు



నర్మెట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగపురి గట్టయ్య మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం అన్నారు. మచ్చుపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగపురి గట్టయ్య (80) అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కాగా, గురువారం మృతుడికి నివాళులు అర్పించిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫరీదుల యాదయ్య, గొల్లపల్లి కుమారస్వామి, గుండేటి పర్వాతాలు, గొల్లపల్లి బాలచందర్, ఎండి జావిద్, భూక్య జయరాం, అంజయ్య, లింగరాజు, బుర్రా రాజు, నరేశ్, లక్ష్మీనారాయణ, సాయన్న, ప్రసాద్, బుచ్చయ్య, చంద్రయ్య, నిఖిల్, యాదగిరి ఉన్నారు.